క్లుప్తంగా

షిర్డీసాయిబాబా ఆలయానికి విరాళం



మంజువాణిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయానికి గాదంశెట్టి ప్రకాష్‌గుప్త జ్ఞాపకార్థం ఆయన భార్య మంజువాణి రూ.2.40 లక్షలు విరాళం అందించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం దాత మంజువాణి రూ.2.40 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాలు, జ్ఞాపికతో సత్కరించారు.

స్వీపర్లకు బియ్యం, దుస్తుల పంపిణీ



దుస్తులు, బియ్యం పంపిణీ చేస్తున్న ఉపసర్పంచ్ తదితరులు

తలుపుల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి, విజయదశమి సందర్భంగా ఉపసర్పంచ్ డీ కే బాబు ఆధ్వర్యంలో పంచాయతీ స్వీపర్లు, సిబ్బంది రెండు జతలు దుస్తులు, బియ్యం ప్యాకెట్ పంపిణీ చేశారు. ఏటా విజయదశమి సందర్భంగా తన సొంత డబ్బుతో కార్యక్రమం చేపడుతున్నట్లు ఉపసర్పంచ్ డీకే బాబు తెలిపారు. కార్యక్రమంలో టోపీరమణ, సెక్రటరీ వెంకటరమణ నాయుడు, వార్డు మెంబర్లు మౌలా, సుభహాన్, శ్రీనాథ్, గంగాధర్ పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



దొడ్డెప్ప

కదిరి అర్బన్: కదిరి మండలం బూరుగుపల్లిలో గ్రీన్ అంబాసిడర్ దొడ్డెప్ప స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర (2025) కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంతో దొడ్డెప్ప విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఈ నెల 6న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

నేరప్రవృత్తికి స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

తాడిమర్రి: రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని డీఎస్పీ హేమంత్ కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక పీర్ల చావిడి వద్ద రౌడీషీటర్లు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, భూతగాదాలు, చిన్నారులు, మహిళలపై జరిగే నేరాలను ఎలా ఎదుర్కోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాల నియంత్రణల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన పోలీసులకు ఆదేశించారు. సీఐ శ్యామ్‌రావు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ పట్టణ ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో వివిధ చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

తనకల్లు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. కోటపల్లిలో శుక్రవారం గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి రోడ్డు భద్రత, మహిళలు, చిన్నారులపై వేధింపులు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

కనగానపల్లి: రీ-సర్వే కార్యక్రమం ద్వారా రైతులు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురం గ్రామంలో రీ సర్వే మూడో దశ కార్యక్రమంపై రెవెన్యూ అధికారులు గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ప్రజలకు రీసర్వే నిబంధనలను గురించి అధికారులు తెలియజేశారు. ముక్తాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని పర్వతదేవరపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి, కొండ్రెడ్డిబావి గ్రామాల్లోని 9,807 ఎకరాల్లో రీ సర్వే జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి తెలిపారు. రైతులంతా తప్పకుండా పాల్గొనాలని ఆమె తెలిపారు. ఈ సర్వే ద్వారా గట్లు, విభాగాలు, రహదారుల సమస్యలు పరిష్కరిస్తామని ఆమె వెల్లడించారు. అనంతరం స్థానిక రెవెన్యూ సిబ్బంది, రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండల సర్వేయర్ కరుణాకర్, ఆర్‌ఐ సరళ, వీఆర్‌ఓ చెన్నకేశవులు పాల్గొన్నారు.

తీర్మానాలకే పరిమితం!

- సభ్యులు సమస్యలు ప్రస్తావించినా పరిష్కారం నిల్
- నేడు మండల సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ కార్యాలయం

ఎన్‌పీకుంట: ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలలో చేసిన పలు తీర్మానాలు ఆచరణలో కార్యరూపం దాల్చకపోవడంతో సమావేశాలు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. గ్రామపంచాయతీల సమస్యలు, అభివృద్ధి పనుల లోపాలు, ప్రజా అవసరాలు తీర్చే మార్గాలు చర్చించటమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశం. కానీ తీర్మానాలు తీసుకున్నా అవి ఆచరణలోకి రాకపోవడం విచారకరమని ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. గత సమావేశానికి ఆర్టీసీ, ఆర్‌అండ్ బీ, కేజీబీవీ, వెటర్నరీ, మైనర్ ఇరిగేషన్, అటవీశాఖలకు సంబంధించి అధికారులు గైర్హాజరయ్యారు. అలాగే పలు శాఖలకు సంబంధించి సమావేశాలకు ఉన్నతాధికారులు హాజరవ్వాలి కానీ వారి స్థానంలో ఆ శాఖకు సంబంధించి చిన్నస్థాయి సిబ్బంది హాజరవుతుండటంతో సమస్యలు పరిష్కారరూపం దాల్చట్లేదని విమర్శలున్నాయి. మరోవైపు చేసిన పలు అభివృద్ధి పనులకు ఇప్పటికీ నిధులు మంజూరు చేసిన పాపాన పోలేదని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎంపీటీసీలకు గౌరవ వేతనం కూడా ఇవ్వలేదు. తీర్మానాలు చేసినా కార్యరూపం దాల్చని సమస్యలివే..

- విద్యార్థులు, భక్తుల సౌకర్యార్థం కదిరి నుంచి ఎన్.పీ.కుంట, రాయచోటి మీదుగా తిరుపతికి బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని తీర్మానం చేశారు. అలాగే బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఎంపీటీసీ సభ్యులు కోరారు. కానీ ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు.
- వంకమద్ది, ఎర్రవంకలవారిపల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, దీనితో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉండటంతో మరమ్మతులు చేపట్టాలని తీర్మానం చేశారు. కానీ ఇంత వరకు ఆ పాఠశాలలు మరమ్మతులకు నోచుకోలేదు.
- ఎన్.పీ.కుంట మండల కేంద్రంలో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండటంతో డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. కానీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు.
- వంకమద్ది చెరువుకు సంబంధించిన మరువకట్టకు మరమ్మతులు చేపట్టాలని తీర్మానం చేశారు. కానీ ఇంతవరకు టెండర్లు పిలవలేదు.
- మండల కేంద్రంలో కూరగాయలు, పశువుల సంత నిర్వహణకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని సభ్యులు కోరగా అప్పట్లో ఓ ప్రైవేటు స్థలంలో ఒక వారం పశువుల సంత నిర్వహించి వదిలేశారు. ఆ సమస్య కూడా ఇంత వరకు పరిష్కరించలేదు. ఇలా తీర్మానాలు పొందిన సమస్యలు ఎన్నో. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో శనివారం జరిగే సమావేశంలో అయినా సమస్యలు పరిష్కారం అవుతాయో లేదో చూడాలి.

ఎస్ఈసీ సభ్యుడు చంద్రశేఖరరెడ్డికి సన్మానం



తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించి స్వీటు తినిపిస్తున్న నాయకులు

తాడిమర్రి: వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. గురువారం, శుక్రవారం మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తాడిమర్రిలోని చంద్రశేఖర్‌రెడ్డి గృహానికి చేరుకుని శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం తాను చేసిన సేవలను గుర్తించి ఎస్ఈసీలో అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. ఇందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వత్థ, నియోజక వర్గం బీసీసెల్ అధ్యక్షులు కుంటాల పుల్లయ్య, పార్టీ మండలాధ్యక్షుడు ఆర్వేటి రామాంజినేయులు, అల్లే సాయినాథ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, గుజ్జల హనుమంతు, నిడిగల్లు సుదర్శనం, గద్దె పురుషోత్తంరెడ్డి, ఆనందరెడ్డి, హనుమంతరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈసీ మెంబర్‌గా డా. బత్తల హరిప్రసాద్



డా. బత్తలహరిప్రసాద్

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా (ఎస్ఈసీ) కదిరికి చెందిన డా. బత్తల హరిప్రసాద్‌ను ఆ పార్టీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి,సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంటు పరిశీలకుడు రమేష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మగ్బూల్ అహ్మద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచనలేకుండా పని చేస్తానని ఆయన పేర్కొన్నారు. బత్తల హరిప్రసాద్‌ను పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్ కుబ్రా

ధర్మవరం అర్బన్: లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్ కుబ్రా తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధ చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ వల్ల ఆడ శిశువుల జననాల రేటు గణనీయంగా పడిపోతోందన్నారు. వాటిని నివారించేందుకు ప్రభుత్వం పీసీ-పీఎన్‌డీటీ యాక్ట్-1994ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం మేరకు లింగ నిర్ధారణ నేరమని, డివిజన్ పరిధిలో లింగ నిర్ధారణ చేసినట్లు ఫిర్యాదులు అందితే లింగ నిర్ధారణ చేసిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. డివిజన్ పరిధిలోని వైద్యశాఖ అధికారులు, ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, తహసీల్దార్లు, రోటరీక్లబ్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ ఆదిశేషు, జిల్లా కో-కన్వీనర్ సాకే వినయ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గాంధీనగర్ సర్కిల్ వద్ద గురువారం గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద సేవ్ ఆర్డీటీ అంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆర్డీటీ సేవలు నిలిచిపోవడం పేద ప్రజల పట్ల తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. సేవ్ ఆర్డీటీ కమిటీ సభ్యులు మంజుల నరేంద్ర, శ్రీనివాసులు, సాకే సోము, హరికృష్ణారెడ్డి, బాషా, రాజశేఖర్, రేగాటిపల్లి నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక సంస్థ ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్ వద్ద శుక్రవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేదిక మండల వైస్ ప్రెసిడెంట్ మాతంగి కాటమయ్య మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎనలేనటువంటి సేవలు అందిస్తున్న ఆర్డీటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు శంకర్, లక్ష్మీనారాయణ, బత్తలపల్లి మండల యూత్ హేమంత్, పవన్, కళ్యాణ్, గిరీష్‌కుమార్, అజయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివక్షకు వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ పోరాటం



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

బత్తలపల్లి: కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ పోరాటం చేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారకర్త కిషోర్‌జీ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సవాళ్లను అధిగమించే మార్గాన్ని ప్రతి స్వయం సేవకుడికీ నిర్దేశిస్తుందన్నారు. అందులో స్వబోధ, సామాజిక సామరస్యం, కుటుంబ ప్రబోధన్, నాగరిక్ శిష్టాచార్, పర్యావరణ్ ఈ ఐదు సంకల్పాల నిర్దేశంలో తదుపరి శతాబ్దిలోకి ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం బత్తలపల్లి పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఎస్‌ఎస్‌ఎఫ్ ప్రచారకర్త కూరే నారాయణస్వామి, నాయకులు కొమ్మినేని వెంకటేష్, షరాబ్ యోగానంద ఆచారీ, సాకే గోపాల్, ఈడిగ కాశప్ప, కొంకా కాశప్ప, ఈశ్వర్‌చంద్ర ప్రసాద్, శివప్రసాద్, రామాంజి, పెద్దన్న, సతీష్, మంగళ రామాంజి, ఉజ్జినప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ధర్మవరం: స్థానిక గాంధీనగర్ సర్కిల్‌లో గురువారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి, మైనార్టీ విభాగం నేత చాంద్‌బాషా, కౌన్సిలర్లు పెనుమూరు నాగరాజు, కేతా లోకేష్, కోఆప్షన్ సభ్యుడు భూశెట్టి రామకృష్ణ, నాయకులు కత్తే పెద్దన్న, బొమ్మన్న, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఈడిగ వినయ్ తేజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయులు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాత్ములకు ఘన నివాళి

పుట్టపర్తి టౌన్: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు పోలీస్ సిబ్బంది మహాత్ముల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి ఆర్థికసాయం



మిత్రుడి భార్యకు సాయం అందిస్తున్న స్నేహితులు

పుట్టపర్తి: బుక్కపట్నం నివాసి షంషీర్ కుటుంబ పోషణ కోసం దుబాయ్ వెళ్లి అనారోగ్యంతో అక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితులు శ్రావణ్, చంద్ర, నారాయణస్వామి, రాజా, సందీప్ (1990 బ్యాచ్ పదో తరగతి బుక్కపట్నం ఉన్నత పాఠశాల) శుక్రవారం షంషీర్ కుమార్తె వివాహం కోసం ఆయన భార్యకు రూ.70 వేలు నగదు, పట్టు చీరె, బియ్యాన్ని అందించారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు



తనకల్లు మండలం మల్లిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

తనకల్లు/ బత్తలపల్లి/ తాడిమర్రి/ గాండ్లపెంట : కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై తగ్గించిన జీఎస్టీతో లబ్ధి చేకూరుతుందని జేడీఏ రామూనాయక్, ధర్మవరం ఏడీఏ లక్ష్మానాయక్, తాడిమర్రి ఏఓ శేఖర్‌నాయక్, గాండ్లపెంట ఏఓ సయ్యద్ షాదాబ్ తెలిపారు. శుక్రవారం తనకల్లు మండలం మల్లిరెడ్డిపల్లి, బత్తలపల్లి మండలం మాల్యవంతం, తాడమర్రి రైతు సేవా కేంద్రం, గాండ్లపెంటలో అధికారులు, ప్రజా ప్రతినిధులు జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాక్టర్లపై గతంలో 12 శాతం ఉండగా 5 శాతానికి తగ్గిందన్నారు. డ్రిప్పులు, స్ప్రింక్లర్లకు గతంలో 13 శాతం ఉండగా ప్రస్తుతం 5 శాతానికి వచ్చిందన్నారు. అలాగే డ్రోన్లు, ఆక్వాకల్చర్, క్యాన్లు తదితర పరికరాలు ప్రస్తుతం 5 శాతం జీఎస్టీతోనే లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఎంపీ పీడీ సుదర్శన్,కదిరి ఏడీఏ సనావుల్లా, ఎంపీడీఓ రామానాయక్, ఏఓ భారతి, హెచ్‌ఓ లావణ్య, బత్తలపల్లి ఏఓ ఓబిరెడ్డి, తాడిమర్రి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట రంగారావు, ఏపీఓ అనిల్, గాండ్లపెంట తహసీల్దార్ బాబురావు, హెచ్‌ఓ ప్రతాపరెడ్డి, ఎంపీపీ సోమశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాత మిద్దె దగ్ధం

ఓడీచెరువు: జౌకలకొత్తపల్లిలోని పాత మిద్దె శుక్రవారం దగ్ధమైంది. వివరాలు..గ్రామానికి చెందిన కుమ్మరి రెడ్డప్ప తన పాత మిద్దెలో ఉలవపొట్టు నిల్వ ఉంచాడు. ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఇంటిపైకప్పునకు ఉన్న చెక్కలతో సహా ఇల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

ఓడీచెరువు: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టుబడి గౌస్‌లాజమ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో డీఏలు, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభలు

గాండ్లపెంట: ఉపాధి హామీ కింద 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై శుక్రవారం వేపరాల, తుమ్మలబైలు, టి. పెద్దతండా, కురుమామిడి, కటారుపల్లి, జి.పెద్దతండా, గొడ్డువెలగలలో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఏ పనులు చేపట్టాలో సభల్లో చర్చించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బత్తలపల్లి: గంటాపురం గ్రామంలో సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, స్వస్తి వాచనం, పంచగవ్య మేళన ప్రోక్షణ, ఋత్విగ్వరనం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ దీక్షా హోమం, జలాధివాసము, మూల మంత్ర జపం, మహా మంగళ నీరాజనం చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో విజయదశమి



పుట్టపర్తి సత్యమ్మ ఆలయం వద్ద అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్



ముదిగుబ్బలో వాసవీ మాతను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ధర్మవారం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో గురువారం విజయదశమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అర్చకులు శమీవృక్షాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ధర్మవరం అర్బన్ పురవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి



మామిళ్లపల్లిలో పూజలందుకున్న దుర్గాదేవి




బత్తలపల్లిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



కదిరి టౌన్: అశ్వవాహనంపై దర్శమిస్తున్న ఖాద్రీశుడు



గొట్లూరులో అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం



రాజరాజేశ్వరిదేవిగా అమడగూరు చౌడేశ్వరి

దివ్యాంగురాలికి పింఛన్ అందజేత

నల్లచెరువు: దివ్యాంగురాలి పింఛన్ సొమ్మును ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం అందజేశారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలు అస్మా మదనపల్లి సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో చదువుతోంది. అయితే తనకు ప్రతి నెలా వచ్చే దివ్యాంగ పింఛన్ సొమ్మును తన సమీప బంధువులు ప్రతి మూడు నెలలకోసారి తనను పాఠశాల నుంచి తీసుకొచ్చి పింఛన్ తీసుకున్న వెంటనే బాలిక వద్ద నగదును లాక్కొని హింసించేవారు. బాలిక నుంచి సమాచారం అందుకున్న వెలుగు ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయులు బంధువుల తీరుపై కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు బాలికకు ప్రతి నెలా వచ్చే పింఛన్ మొత్తాన్ని తన బ్యాంకు ఖాతాకు జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. గడిచిన మూడు నెలల పింఛన్ సొమ్మును ఎంపీడీఓ అస్మాకు అందజేశారు.

ఏరియా ఆస్పత్రిలో సమస్యలు తీర్చాలి

కదిరి టౌన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరితకు సీపీఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి రోజూ 500 మంది నుంచి 600 మంది రోగులు వస్తుంటారని, ఆస్పత్రిలో ఒక్కటే మరుగుదొడ్డి ఉండటడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం తాగునీటి వసతి లేకపోవడం దారుణమన్నారు. నాయకులు జగన్మోహన్, బాబ్జాన్, రామ్మోహన్, సుధాకర్‌రెడ్డి, రఫీ, అంజనేయులు, గంగప్ప పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కనగానపల్లి: సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాంట్రాక్టు ఉద్యోగులతో కలిసి కనగానపల్లిలోని విద్యాశాఖ కార్యాలయం ముందు 'దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభ' పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బంగి నారాయణ స్వామి, జగదీష్, వరలక్ష్మి, సుకన్య, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

తలుపుల: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంగటివారిపల్లి, వేపమానిపేటలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వన్యప్రాణుల రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.